క్లుప్తంగా

పోలింగ్‌కు భంగం కలిగిస్తే చర్యలు

● టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి



మాట్లాడుతున్న బాలచంద్రారెడ్డి

టెక్కలి: ప్రశాంతమైన పోలింగ్‌కు భంగం కలిగించాలని ఎవరైనా చూస్తే వారిపై చర్యలు తీవ్రంగా ఉంటాయని టెక్కలి డీఎస్పీ బాల చంద్రారెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. టెక్కలి నియోజకవర్గంలో 315 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ఓటింగ్ నిర్వహించేందుకు సుమారు 470 మంది పోలీస్ సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. రౌడీ షీటర్లతో పాటు ఇటీవల అల్లర్లకు పాల్పడి బైండోవర్ కేసులు నమోదైన 38 మందిని గుర్తించామన్నారు. సుమారు 82 క్లిష్టమైన పోలింగ్ కేంద్రాల్లో సాధారణ పోలీస్ సిబ్బందితో పాటు ప్రత్యేక బలగాలు ఆయుధాలతో బందోబస్తు నిర్వహిస్తారు.

సందడిగా నర్సుల దినోత్సవం



నైటింగేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా నైటింగేల్ చిత్ర పటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నర్సులు కృష్ణవేణి, విజయలక్ష్మి, ఆస్పత్రి ఏవో ఏపీపీ రమణమూర్తి ఉన్నారు.

నందిగాంలో 50,292 మంది ఓటర్లు



కొండతెంబూరు గ్రామానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది

నందిగాం: మండలంలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో 50,292 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరి కోసం 88 పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. సమస్యాత్మక గ్రామాలైన అన్నాపురం, దిమ్మిడిజోల, కాపుతెంబూరు, హరిదాసుపురం, నరేంద్రపురంలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు.



టెక్కలి: ఆర్వో నూరుల్ కమర్, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ల సీలును తెరుస్తున్న సిబ్బంది



టెక్కలి: సిబ్బంది తరలింపునకు సిద్ధం చేసిన బస్సులు

సమరానికి సర్వం సిద్ధం





టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్ట్రాంగ్ రూమ్ వద్దకు హాజరైన ఎన్నికల సిబ్బంది

● పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది
● టెక్కలి నియోజకవర్గంలో 315 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

టెక్కలి: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సార్వత్రిక ఎన్నికల రణరంగానికి సమయం ఆసన్నమైంది. సోమవారం జరగనున్న పోలింగ్ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. టెక్కలి నియోజకవర్గంలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లో 315 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,36,327 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 1,17,816 మంది, మహిళలు 1,18,502 మంది, ఇతరులు తొమ్మిది మంది ఉన్నారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించి ఆదివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద స్ట్రాంగ్ రూమ్ నుంచి ఆర్వో నూరుల్ కమర్ సమక్షంలో సిబ్బందికి సామగ్రిని అందజేశారు. ముందుగా వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లోని ఈవీఎంలను బయటకు తీసుకువచ్చారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించి పీవో, ఏపీవో, ఇతర సిబ్బంది కలిసి సుమారు 2,200 మంది ఎన్నికల నిర్వాహణ సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి నేతృత్వంలో ప్రశాంతమైన ఎన్నికల నిర్వాహణకు సుమారు 470 మంది పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించనున్నారు. వీరితో పాటు అధనంగా కేంద్ర బలగాలు మొహరించనున్నాయి. ఉదయం 5:15 గంటలకు మాక్ పోల్ నిర్వహించి అనంతరం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది.



నరసన్నపేట: కేటాయించిన కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

నరసన్నపేటలో..

నరసన్నపేట: నియోజకవర్గంలో పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యావని రిటర్నింగ్ అధికారి రామ్మోహనరావు ఆదివారం తెలిపారు. ఈ మేరకు పోలింగ్ సిబ్బంది 290 కేంద్రాలకు చేరుకున్నారని అన్నారు. ఈవీఎంల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వద్దే భోజన సదుపాయాలు బీఎల్‌ఓలు కల్పిస్తారని ఇతరుల సహాయాన్ని తీసుకోవద్దని కోరారు. కాగా నరసన్నపేట డిగ్రీ కళాశాల రిసెప్షన్ కేంద్రం నుంచి సిబ్బంది ఆదివారం తరలివెళ్లారు. ఎన్నికల విధుల్లో 2100 మంది ఉద్యోగులు, ఆరువందల మంది పోలీసులు ఉన్నారు.



నరసన్నపేట: పోలింగ్ సిబ్బంది

నిబంధనలు పాటించాలి

● జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



సిబ్బందితో మాట్లాడుతున్న మనజీర్ జిలానీ సమూన్

నరసన్నపేట: నియోజకవర్గంలో ప్రశాంత పోలింగే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలో పోలింగ్ సామగ్రి పంపిణీ కోసం ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. అనంతరం పీఓ, ఏపీఓలతో మాట్లాడారు. ఎలా పోలింగ్ చేస్తారు.. మాక్ పోలింగ్ ఎప్పుడు చేస్తారు అని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో మాక్ పోలింగ్ చేపట్టాలని అన్నారు. ఎక్కడా నిబంధనలు అతిక్రమించి వ్యవహరించవద్దని సూచించారు. ఏజెంట్లకు వారి విధులు వివరించి వారి సహకారంతో పోలింగ్ ప్రశాంతంగా పూర్తి చేయాలన్నారు. పోలింగ్ ఏర్పాట్లు, భోజనాలు, ఇతర సదుపాయాలు గురించి ఆరా తీశారు. స్థానిక ఆర్‌ఓ రామ్మోహనరావు, ప్రత్యేక అధికారి నగేష్‌లకు పలు సూచనలు చేశారు. ఈవీఎంలు ఎక్కడ రిపేర్ అయినా వెంటనే రీప్లేస్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కోటబొమ్మాళి మండలంలో 74 పోలింగ్ కేంద్రాలు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలంలోని 38 పంచాయతీల పరిధిలో 74 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కోసం అధికారులు సిద్ధం చేశారు. కేటాయించిన కేంద్రాలకు సిబ్బంది సైతం చేరుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు మండల ఎన్నికల అధికారి వై. పద్మజ తెలిపారు.

గ్రామాలకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

సారవకోట: మండలం సోమవారం జరగనున్న సాధారణ ఎన్నికల నిర్వాహణకు అధికారులు సన్నాహాలు చేపట్టారు. ఆదివారం సాయంత్రానికే కేటాయించిన గ్రామాలకు సిబ్బంది చేరుకొని ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మండలంలోని 64 పోలింగ్ బూత్‌లకు సిబ్బంది చేరుకున్నారు. వీరికి ఆయా బీఎల్‌ఓలు కావాల్సిన ఏర్పాట్లు చేపట్టారు. మండలంలో 21,757మంది పురుషులు, 21,977మంది స్త్రీలు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.

షిఫ్ట్ ఆపరేటర్‌పై ఫిర్యాదు

టెక్కలి: శాసనాం గ్రామానికి చెందిన విద్యుత్ శాఖ షిఫ్ట్ ఆపరేటర్ డొంకాన మాధవరావుపై వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికలు, విద్యుత్ శాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకుడు అచ్చెన్నాయుడు ఎన్నికల ప్రచారంలో మాధవరావు పాల్గొన్నారు. ఆయన పాల్గొన్న వీడియాలతో సహా అధికారులకు ఫిర్యాదు చేశారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పని చేయండి

● పోలీసు సిబ్బందికి ఎస్పీ జి.ఆర్.రాధిక సూచన



మాట్లాడుతున్న ఎస్పీ జి.ఆర్.రాధిక

నరసన్నపేట: నరసన్నపేట నియోజకవర్గంలో సోమవారం జరగనున్న ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యేలా చూడాలని పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్నికల బందోబస్తు నిర్వహించనున్న పోలీసు సిబ్బందితో ఆమె ఆదివారం ఉదయం సమావేశమై పలు సూచనలు చేశారు. ఒక్కో రూట్‌లో ఒక్కో స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాన్ని నియమించామని వీరు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో నిత్యం తిరుగుతుంటారని అన్నారు. అలాగే ప్రత్యేక పారామిలటరీ బలగాలు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, ఆర్మడు ఫోర్స్ బలగాలతో పాటు లోకల్ పోలీసులు ఉంటారని అన్నారు. పోలింగ్ ముగిసి ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే వరకూ పోలీసు సిబ్బంది బాధ్యతగా ఉండాలన్నారు. ఎవరూ రాజకీయ పార్టీలకు కొమ్ము కాయవద్దని ఆదేశించారు. అలాగే నరసన్నపేట సీఐ, ఎస్ఐలకు ప్రత్యేక సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

‘ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు’


జి.గొనపపుట్టుగ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మీ

కవిటి: మండలంలోని 70 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు గానూ పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ ఎం.లక్ష్మీ తెలిపారు. వివిధ గ్రామాల్లో పోలింగ్ రోజున సజావుగా ఎన్నికల నిర్వహణకు కేంద్రాల్లో నిర్వహించిన ఏర్పాట్లపై ఆమె క్షేత్రస్థాయిలో తనిఖీలు ఆదివారం నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా జన సమీకరణ లేకుండా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఓటర్లు ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణకు సహకరించి శతశాతం పోలింగ్ జరిగేలా సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

సరిహద్దులో ప్రగతి పథం

కంచిలి: రాష్ట్రానికి ముఖద్వారంగా ఇచ్ఛాపురంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టించింది. కిడ్నీవ్యాధి మహమ్మారిని సమూలంగా తుదముట్టించడానికి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నడుంకట్టారు. ఇంటింటికీ రక్షిత మంచినీటిని సరఫరా చేయాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టును ఏర్పాటు చేసి జాతికి అంకితం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రూ.680.16 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు సంక్షేమ పథకాల ద్వారా రూ.1473.86 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు.

వైద్యానికి పెద్దపీట

- సోంపేట సీహెచ్‌సీకి రూ.5 కోట్లతో, బారువ సీహెచ్‌సీకి రూ.6 కోట్లతో కొత్త భవనాలు నిర్మించారు.
- కవిటి మండలం మాణిక్యపురం, ఇచ్ఛాపురం మండలం ఈదుపురం పీహెచ్‌సీలను, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో బెల్లుపడ, పురుషోత్తపురం యూపీహెచ్‌సీలను రూ.1.75 కోట్లతో నిర్మించారు.
- సోంపేట సీహెచ్‌సీలో 21, కవిటి సీహెచ్‌సీలో 19 డయాలసిస్ బెడ్స్‌ను ఏర్పాటు చేశారు.

కొత్త దారులు

- సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాల ఉద్దానం గ్రామాలను కలిపే ఎస్‌కేఈ రోడ్డును రూ.31.80 కోట్లతో విస్తరించారు.
- ఇచ్ఛాపురం నుంచి పురుషోత్తపురం వరకు రోడ్డు అభివృద్ధిని రూ.5 కోట్లతో చేపట్టారు. బూర్జపాడు నుంచి డొంకూరు వరకు రూ.3.67 కోట్లతో, కొల్లూరు రోడ్డును రూ.16 లక్షలతో, బుడ్డెపుపేట నుంచి బాలకృష్ణాపురం రోడ్డు రూ.74 లక్షలతో, పోలేరు రోడ్డును రూ.89.6 లక్షలతో, మండపల్లి, రుషికుద్ద రోడ్డును రూ.65 లక్షలతో అభివృద్ధి చేశారు.
- బూర్జపాడు బ్రిడ్జిని రూ.10.50 కోట్లతో, డొంకూరు బ్రిడ్జిని రూ.6.30 కోట్లతో నిర్మించారు.


సోంపేట సామాజిక ఆరోగ్య కేంద్రం

- ఇచ్ఛాపురంలో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం
- కొత్తగా మౌలిక వసతుల కల్పన
- సంక్షేమ పథకాల ద్వారా పేదలకు రూ.1473.86 కోట్లు
- రూ.680.16 కోట్లతో అభివృద్ధి పనులు

విద్యకు ప్రాధాన్యత

నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కోసం నాడు-నేడు పథకంతో పాఠశాలలు, కళాశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది. దీంతోపాటు బారువ డిగ్రీ కళాశాలకు రూ.5 కోట్లతో, సోంపేట జూనియర్ కళాశాలకు రూ.2 కోట్లతో కొత్త భవనాల్ని నిర్మించారు.

వైఎస్సార్ పార్కు ఏర్పాటు

కంచిలి మండలం మఠం సరియాపల్లి గ్రామంలో జగనన్న కాలనీ సమీపంలో వైఎస్సార్ పార్కును నిర్మించారు. దీన్ని రూ.15 లక్షల గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ఒక మారుమూల గ్రామంలో ఇలాంటి పార్కును ఏర్పాటు చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

కొత్త బస్సులు, రైళ్లు

- ఇచ్ఛాపురం మండలంలో ఇచ్ఛాపురం నుంచి మశాకపురం, బిర్లంగి మీదుగా కొలిగాం వరకు 7 కిలోమీటర్లకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.
- విశాఖపట్నం-పలాస ప్యాసింజర్ రైలును బరంపురం వరకు విస్తరించడానికి, ఇచ్ఛాపురంలో వందే భారత్ రైలు హాల్టుకు కృషి చేసి సఫలీకృతమయ్యారు.


కవిటిలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్


నూతనంగా నిర్మితమైన ఎస్‌కేఈ రోడ్డు


కొలిగాంలో సుజల ధార ప్రాజెక్టు


బారువ డిగ్రీ కళాశాల

ప్రతి ఒక్కరూ సహకరించాలి

- పలాస నియోజకవర్గ ఎన్నికల అధికారి భరత్ నాయక్

కాశీబుగ్గ: ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పలాస నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, పలాస ఆర్డీవో భరత్ నాయక్ కోరారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం పోలింగ్ కేంద్రాల అధికారులు, సిబ్బందితో ప్రత్యేక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది ఆదివారం ఉదయం నుంచి అందుబాటులోకి వచ్చేశారన్నారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి ఓటర్లు ఓటు వేయడానికి అన్ని చర్యలు చేపట్టామన్నారు. వికలాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. పలాస నియోజకవర్గ పరిధిలోని మందస, పలాస, వజ్రపుకొత్తూరు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి 284 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు సిద్ధం చేసి, 5+1 అధికారులు రూట్ బస్సుల్లో పోలీసు బందోబస్తుతో పంపించామన్నారు. 37 మంది సెక్టార్, 37 మంది రూట్ అధికారులకు నియమించామని వెల్లడించారు.


లూప్, గిరి ప్రాంతాలకు వెళ్లనున్న వాహనాలు


ఈవీఎం మెషిన్లు, అధికారుల తరలింపునకు వచ్చిన ఆర్టీసీ బస్సులు


రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అధికారులు


జాబ్ చార్ట్ వెదుకులాటలో ఎన్నికల అధికారుల హడావుడి


పలాస హైస్కూల్‌లో చెట్టుకింద సేద తీరుతున్న అధికారులు


సహాయకుల డ్యూటీ స్లిప్‌లు ఇస్తున్న అధికారులు

పోలింగ్‌కు సర్వం సిద్ధం


కాశీబుగ్గ: పోలింగ్‌కు సిద్ధమైన కాశీబుగ్గ హైస్కూల్


కాశీబుగ్గ: పదిమంది అభ్యర్థులతో అతికించిన పలాస జాబితా


కాశీబుగ్గ: మూడు రోడ్ల కూడలి యూపీ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు


పోలింగ్ కేంద్రం వద్ద తాగునీటి సదుపాయం


పలాస: ఎన్నికల సామగ్రిని పంపించడానికి సిద్ధం చేస్తున్న అధికారులు


పలాస: పర్యవేక్షిస్తున్న ఎన్నికల అధికారి డాక్టర్ భరత్‌నాయక్


సోంపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎన్నికల అధికారులు

సోంపేట: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సోమవారం జరిగే పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. నాలుగు మండలాలకు సంబంధించి 299 పోలింగ్ కేంద్రాలకు సుమారు 4 మంది ఎన్నికల అధికారులు సమాయత్తమయ్యారు. సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నాలుగు మండలాల సిబ్బందికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పంపిణీ కేంద్రం నుంచి నాలుగు మండలాల పోలింగ్ బూత్‌లకు కళాశాల వద్ద నుంచి బస్సుల ద్వారా సిబ్బంది, ఎన్నికల సామాగ్రి తరలించారు. ఆర్వో సుదర్శనదొర ఎన్నికల ఏర్పాట్లు పరిశీలించారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసు సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

- **పోలింగ్ స్టేషన్లకు చేరిన ఎన్నికల సామగ్రి**

పలాస: మండలంలోని మొత్తం పోలింగ్ స్టేషన్లకు ఆదివారం సాయంత్రం నాటికి ఎన్నికల సామగ్రి చేరింది. కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల సిబ్బందితో పాటు సామగ్రిని అధికారులు చేర్చారు. పలాస ఆర్డీవో డాక్టర్ భరత్‌నాయక్ దగ్గరుండి పర్యవేక్షించారు. నియోజకవర్గంలో మొత్తం పురుష ఓటర్లు 1,7,0278 మంది, స్త్రీలు 1,12,049 మంది ఉన్నారు. వీరంతా సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారి డాక్టర్ భరత్‌నాయక్ చెప్పారు.

- కాశీబుగ్గ: 2024 సార్వత్రిక ఎన్నికలకు పలాస నియోజకవర్గం ముస్తాబైంది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరగనున్న ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని పలాస ఎన్నికల అధికారి భరత్ నాయక్ తెలిపారు. నియోజకవర్గంలో జరుగుతున్నటువంటి ఎన్నికల సంగ్రామానికి పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, మందస, వజ్రపుకొత్తూరు, పలాస మండలాల్లో 284 ఎన్నికల కేంద్రాలు సిద్ధం చేశారు. పలాస నియోజకవర్గంలో మొత్తం 2,19,248 ఓట్లు ఉండగా అందులో పురుషులు 1,07,278, మహిళలు 1,12,049 ఓటర్లు ఉన్నారు. వీరంతా ఓటుహక్కు వినియోగించుకోవడానికి మొత్తంగా ఎన్నికల అధికారుల నుంచి సహాయకులు మొత్తంగా 1,900 మందికిపైగా పని చేస్తున్నారు. వీడియోగ్రాఫర్లు, మైక్రో సహాయకులు అదనంగా ఉన్నారు. ఈ పక్రియ సక్రమంగా జరగడానికి మొత్తం డీఎస్పీలు 2, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు 6, ఎస్‌ఐలు 12, సీఆర్‌పీఎఫ్ జవాన్లు రెండు బెటాలియన్లు, పీసీలు, హెచ్‌సీలు 486 ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లు 231 మంది, మొత్తంగా రక్షణకు సంబంధించి 803 మంది పనిచేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాలకు ట్రై సైకిల్స్


పోలింగ్ కేంద్రాలకు ట్రై సైకిల్స్ పంపిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో దివ్యాంగులు, నడవలేని వారి కోసం పోలింగ్ కేంద్రాల్లో ట్రై సైకిల్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్‌వో బి.సుదర్శన్ దొర తెలిపారు. సంబంధిత ఎంపీడీవో ఆధ్వర్యంలో ఈ సైకిళ్లను ఆయా పోలింగ్ కేంద్రాలకు పంపించడం జరిగిందన్నారు.

ఘనంగా మదర్స్ డే


తల్లికి వందనం కార్యక్రమంలో వృద్ధులు, అనాథలు

కంచిలి: మండలంలోని మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమంలో మదర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోంపేటకు చెందిన సూర్యనారాయణ సాహు, రితు సాహు దంపతుల కుమార్తె శిరీష సాహు, కుమారుడు రవితేజ్ సాహు ఆశ్రమంలోని అనాథలు, వృద్ధులకు కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రూ.21 వేలు మొత్తాన్ని ఆశ్రమ నిర్వాహకుడు గుళ్ల రమేష్‌కు అందజేశారు. వీరి దాతృత్వంపై నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి సంతకం..!

- కనీవినీ ఎరుగని రీతిలో పలాసలో అభివృద్ధి
- రూ.2 వేల కోట్లతో ప్రగతి పనులు
- సంక్షేమ పథకాల ద్వారా రూ.1500 కోట్ల మేర లబ్ధి

కాశీబుగ్గ: జిల్లాలో అత్యంత కీలక ప్రాంతమైన పలాస నియోజకవర్గం కనీవినీ ఎరుగని రీతిలో ఈ ఐదేళ్లలో అభివృద్ధి సాధించింది. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవిని సైతం అధిష్టించిన డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రగతి పనుల్లోనూ అదే జోరు కనబరిచారు. పాత పనులను పూర్తి చేసి ప్రభుత్వ సాయంతో కొత్త ప్రాజెక్టులను సైతం ఏర్పాటు చేయగలిగారు. ఏకంగా రూ.2 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులు పలాసలో జరిగాయి. వీటితో పాటు సంక్షేమ పథకాల రూపంలో రూ.1500 కోట్లు సామాన్యుల ఖాతాలకు చేరాయి.

ఉపరితల జలం

వైఎస్సార్ సుజల ధార ప్రాజెక్టులో భాగంగా పలాస నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు హిరమండలం నుంచి తాగునీరు అందించే ఏర్పాటు చేశారు. కిడ్నీ వ్యాధి బాధితులకు ఇది వరం లాంటిది. ఎక్కడో హిరమండలంలోని వంశధార రిజర్వాయర్ నుంచి నీటిని ఇక్కడి వరకు తరలించారు. రూ.700 కోట్ల ఖర్చుతో ఈ కలను సాకారం చేసి ఈ ప్రాంత ప్రజల భవిష్యత్‌కు రక్షణ కల్పించారు.

రూ.85 కోట్లతో కిడ్నీ పరిశోధన కేంద్రం

ఇప్పటివరకు జీడి పప్పు అంటే పలాస గుర్తుకువచ్చేది. ఇకపై కిడ్నీ ఆస్పత్రి అన్నా పలాసే గుర్తుకు వచ్చేలా ఇక్కడ కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని ప్రభుత్వం నిర్మించి ప్రారంభించింది. రూ.85 కోట్లతో కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ కేంద్రాన్ని నిర్మించారు. ప్రస్తుతం స్పెషలిస్టులతో పాటు మొత్తంగా 17 మంది వైద్యులు, స్టాఫ్ నర్సులు 60 మంది, డీడీఏ స్టాఫ్ 50 మంది, సపోర్టింగ్ స్టాఫ్ 20 మంది సేవలు అందిస్తున్నారు.

ఆఫ్‌షోర్ పునఃప్రారంభం

మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులకు రీటెండరింగ్ వేయడంతో రూ.860 కోట్లు టెండర్ పూర్తి చేసి పనులు పునః ప్రారంభించారు. ప్రస్తుతం కుడి కాలువ పనులు ప్రారంభించారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టుతో 24,600 ఎకరాలకు నీరు అందనుండగా ఒక్క కుడి కాలువ పూర్తయితే 12,400 ఎకరాలకు సాగునీరు అందుతుందని అధికారులు చెబుతున్నారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టులో నీటి నిల్వ 1.860 టీఎంసీలు ఉండనుంది. అవసరార్థం కుడి కాలువ నుంచి 136 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడానికి వీలుంటుంది.

రూ.90కోట్లు తిత్లీ పరిహారం విడుదల

నియోజకవర్గం పరిధిలో తిత్లీ తుఫాన్ బాధితులకు ఈ సర్కారు రూ.90 కోట్ల పరిహారం విడుదల చేసింది. పెంచిన పరిహారం మంజూరు చేస్తానని ఇచ్చిన మాట నిలబెట్టుకుంది.

అతిపెద్ద జగనన్న కాలనీ

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో జాతీయ రహదారి పక్కన రామకృష్ణాపురం రెవెన్యూ పరిధి, కోసంగిపురం గ్రామం వద్ద 49 ఎకరాల్లో జగనన్న కాలనీ నిర్మించారు. ఇప్పటికే వందల సంఖ్యలో నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు సైతం పూర్తి చేశారు. వీటితో పాటు నియోజకవర్గంలో ప్రధాన రహదారులన్నీ పూర్తి చేశారు.


రూ.85 కోట్లతో నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి


శరవేగంగా నిర్మితమవుతున్న ఫ్లై ఓవర్ వంతెన


వజ్రపుకొత్తూరు మండలం గరుడభద్ర సచివాలయం

జీడికి జీవం

పలాసలో 400కుపైగా జీడి పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడ రోజుకు రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు వ్యాపారం జరుగుతుంది. అయితే ఇక్కడి వ్యాపారులకు రావాల్సిన ప్రోత్సాహకాల విషయంలో టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. వైఎస్సార్ సీపీ సర్కారు మాత్రం 2014 నుంచి 2020 వరకు రావాల్సిన జీడి ప్రోత్సాహకాలు రూ.120 కోట్లను విడుదల చేసింది. అంతేకాకుండా 60 ఎకరాల విస్తీర్ణంలో నూతన పారిశ్రామిక వాడకు సీఎం శంకుస్థాపన కూడా చేశారు.




పలాస - కాశీబుగ్గలను కలిపే కేటీ రోడ్డు